# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల ధ్వంసం ఘటనలపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**
2. **శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలను చేపడుతున్నామని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు.**
3. **తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **తెలంగాణ వ్యాప్తంగా తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలిపారు.**
5. **ఈ రోజు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల ధ్వంసం ఘటనలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలోని 202వ పోలింగ్ స్టేషన్‌తో పాటు ఏడు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ధ్వంసం అయ్యాయన్నారు. పల్నాడు. జిల్లా ఎన్నికల అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాల వీడియో ఫుటేజీలను పోలీసులకు అందజేశారని పేర్కొన్నారు. ఈవీఎం ధ్వంసం కేసులో శాసన సభ్యులు పి. రామకృష్ణారెడ్డిని నిందితుడిగా చేర్చారన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం చాలా తీవ్రంగా పరిగణిస్తూ, ఈ ఘటనల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించింది.

-------------------------

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలను చేపడుతున్నామని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాల పరిధిలోని ముఖ్యమైన కూడళ్లు, గ్రామ శివారులు, అనుమానిత వ్యక్తులు, నేరస్తుల ఇళ్ళతో పాటు ఇతర ప్రాంతాల్లో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించి, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 301 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సోదాలు నిర్వహించామని తెలిపారు అదేవిధంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సందర్భంగా ఘర్షణలకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై

కేసులు నమోదు చేశామని డీజీపీ  పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ –టీఎస్ఐఐసీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని అత్యుత్తమ పాలసీలను అధ్యయనం చేయాలని... పారిశ్రామిక అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడేలా నూతన పాలసీలు ఉండాలన్నారు. అంకుర సంస్థలు, ఎగుమతులు, మెడికల్ టూరిజం, గ్రీన్ ఎనర్జీ వంటి ప్రణాళికలను సవరణ చేయాలని, చేనేత రంగానికి సంబంధించి నేత కార్మికులకు ఉపయోగపడేలా కొత్త పాలసీని రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణవ్యాప్తంగా తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో  ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వడ్లు కొనుగోలు చేసే ప్రక్రియ ప్రారంభించామని చెప్పారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని వెల్లడించారు. సన్నరకం వడ్లకు 500 రూపాయల అదనపు ధరను చెల్లిస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలుపై ప్రతిపక్షం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలన్న ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ జీవ వైవిధ్య అవగాహనా దినోత్సవం ఇంటర్నేషనల్ డే ఫర్ బయోలాజికల్ డైవర్శిటీ నిర్వహిస్తున్నారు. భూమిపై ఉన్న జీవాల మధ్య భేదాన్నే జీవ వైవిధ్యం అంటారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదం చేసే  లక్షలాది జంతు జాతులు, వృక్ష జాతులు, నీటి వనరులు ఈ రోజు అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. వీటిని పరిరక్షించడం ద్వారా మనం వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు.

---------------------------

గిరిజనుల సాంస్కృతిక హస్తకళా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఈ రోజు  విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు  విశాఖ జిల్లా అటవీశాఖ అధికారి అనంత్ శంకర్ పేర్కొన్నారు. గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులకు ఆర్థిక సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ, ఈ కామర్స్ ప్లాట్ ఫామ్ అమెజాన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో  జరిగే అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో విశాఖ జిల్లా అటవీశాఖ అధికారి అనంత్ శంకర్ అమెజాన్ ఇండియాతో అవగాహన ఒప్పందాలపైన సంతకం చేయనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్‌ను రేపటి నుంచి నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి తెలిపారు. ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. కోర్సులు, కళాశాలల ఎంపికకు మే 31 నుంచి జూన్ 5 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదు చేసుకోవచ్చని  తెలిపారు. జూన్ 5న ఐచ్ఛికాలను  మార్చుకోవచ్చని చెప్పారు.  జూన్  7న సీట్లను కేటాయించి,

10 నుంచి 14 వరకు ప్రవేశాలను  ఖరారు చేస్తామని వివరించారు. విద్యార్థులు సీటు పొందిన కళాశాలల్లో వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్ విధానం ద్వారా రిపోర్టు చేయాలని, జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

---------------------------

ట్రాక్ నిర్వహణ కారణాల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పౌర సంబంధాల ప్రధానాధికారి  సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాచిగూడ– రాయచూర్, సికింద్రాబాద్ – గుంటూరు  ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు రద్దు కానున్నాయని తెలిపారు. దౌండ్– నిజామాబాద్, నిజామాబాద్– పండరీపూర్ నిజామాబాద్ –ముధ్ఖేడ్ మధ్య రైళ్ళ పాక్షికంగా రద్దు కానున్నాయని పేర్కొన్నారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం తుపానుగా బలపడనుందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుపానుగా బలపడిన తర్వాత ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరాల వైపు పయనించే అవకాశముందని పేర్కొన్నారు.  మరోవైపు ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగురోజుల్లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.  దక్షిణ కోస్తా జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వానలు కురుస్తాయని తెలిపింది. 30 నుంచి 40 కి.మీ.వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశముందని హెచ్చరించింది.

అలాగే తెలంగాణలో ఈ రోజు, రేపు  పలు ప్రాంతాల్లో వానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

---------------------------

చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్ ఫోన్లను తిరిగి వినియోగదారులకు అందించే ఫోన్ రికవరీలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని అదనపు డీజీ మహేష్ భగవత్ తెలిపారు. గతేడాది ఏప్రిల్ 19  నుంచి ఇప్పటి వరకు 30 వేల 49 ఫోన్లు రికవరీ చేసినట్టు తెలిపారు. సెల్ ఫోన్ కనిపించకుండా పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు.

---------------------------

తెలంగాణలోని 10 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు ఇన్ చార్జ్ ఉప కులపతులను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 10  విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవీకాలం నిన్నటితో ముగియడంతో  ఇన్ చార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గత రాత్రి  కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్  జట్ల మధ్య జరిగిన తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు విజయం సాధించింది.  టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 19.3 ఓవర్లలో

159 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం కోల్‌కతా జట్టు 13.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 164 పరుగులతో విజయం సాధించి ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. కాగా ఈరోజు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య అహ్మదాబాద్లో రెండో క్వాలిఫయర్ మ్యాచ్ జరగనుంది. ఈ నెల 26న చెన్నైలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

---------------------------

బాపట్ల జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లాలో కృష్ణానది, గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక లభ్యమయ్యే జువ్వలపాలెం, గాజులలంక, పెద్దలంక, పెనుమూడి, అనమనమూరు ప్రాంతాలను ఎస్పీ వకుల్ జిందాల్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఇసుక లభ్యమయ్యే రేవుల వద్ద ఇసుక తవ్వడానికి అక్రమంగా రవాణా చేయడానికి అనుమతి లేదన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేపడితే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ఇసుక లభ్యమయ్యే రేవుల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

=======================